సాక్షి
కర్నూలు
బుధవారం । 5 । జూలై । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి మంగళవారం కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



రైతు చూపు.. మిర్చి వైపు

గతేడాది మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో జిల్లా రైతులు ఈ ఏడాది మిర్చి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు నారుపోసి సాగుకు సిద్ధమయ్యారు. 8లో..

న్యూస్‌రీల్

రానున్న రోజుల్లో భారీ వర్షాలకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్)/ఎమ్మిగనూరు రూరల్: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు చిరు జల్లులతో పాటు ఓ మోస్తరు వర్షపాత సూచన ఉన్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహదేవయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షాలు తేలికపాటి నుంచి ఒక మోస్తరుకే పరిమితం అయ్యాయి. ఇప్పటి వరకు ఖరీఫ్ పంటల సాగులో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది. మామూలుగా అయితే ఈ సమయానికి 50 శాతం వరకు సాగు పూర్తి కావాల్సి ఉంది. వర్షాలు లేకపోవడంతో సాగు 15 శాతం వరకు లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఎట్టకేలకు రుతుపవనాలు చురుగ్గా ఉండటం వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి కోసిగి, సీ.బెళగల్, గూడూరు, వెల్దుర్తిలలో తేలికపాటి వర్షం కురిసింది. రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున మిరప నారుమడిలో వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు విత్తనం మొలకెత్తిన తర్వాత 7, 15 రోజులకు 3 గ్రాముల కాపర్ అక్సీక్లోరైడ్ లేదా 10 గ్రాముల ట్రికోడెర్మా+సూడోమోనాస్ పొడి మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు.

ముఖ గుర్తింపుతోనూ పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లాలో జూలై నెల వైఎస్ఆర్ పింఛను కానుక పంపిణీ చురుగ్గా సాగుతోంది. పింఛన్ల పంపిణీ బుధవారం కూడా కొనసాగుతుంది. 60 ఏళ్లు పైబడిన పింఛనుదారులు వేలిముద్రలు, ఐరీష్ నమోదు కాకపోతే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందే అవకాశం కల్పించారు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,36,773 పింఛన్లు ఉండగా 2,33,206 మందికి పంపిణీ చేశారు. 98.49 శాతం పంపిణీ జరిగినట్లు డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ మల్లికార్జున తెలిపారు.

నేడు ఎస్జీటీలకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న అన్ని యాజమాన్యాల సెకండరీ గ్రేడ్ టీచర్ల పదోన్నతుల కౌన్సెలింగ్ బుధవారం ఉదయం జరుగనుంది. నగరంలోని బిషప్ చర్చ్ సమీపంలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ వి.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎస్జీటీ (తెలుగు, ఉర్దూ, కన్నడ), పీఈటీలు, లాంగ్వేజ్ పండిట్లు, తత్సమాన హోదా గల ఉపాధ్యాయుల పాఠశాల సహాయకుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్ www.deokml13.blogspot.comలో ఉంచినట్లు ఆయన వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు ఉపాధ్యాయులు సర్వీస్ రిజిస్టర్లతో పాటు రెండు సెట్ల ధ్రువ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. పదోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ధ్రువ పత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

సామాజిక పోరాటాలకు స్ఫూర్తి అల్లూరి

- మన్యం వీరుడికి నివాళులర్పించిన కలెక్టర్



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్) : సామాజిక పోరాటాలకు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిదాయకులు అని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. విల్లంబులతో తెల్లదొరలను గడగడలాడించిన వీరుడని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మన్యం వీరుడి చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అడవి బిడ్డల పక్షాన నిలబడి ఆంగ్లేయులతో పోరాడారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్, డీబీసీడబ్ల్యూఓ వెంకటలక్ష్మి, లంబాడి రాష్ట్ర నాయకులు యోగేష్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, డీవీఎంసీ సభ్యులు వైహెచ్ ఎరుకల రాజు, సాయిప్రదీప్‌తోపాటు వివిధ కుల సంఘాల నాయకులు హాజరయ్యారు.



సమస్య ఇది..

ఇక్కడ ప్రమాదకరంగా కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రకాష్ నగర్ పోస్టల్ కాలనీ ప్రహరీ సమీపంలో ఉంది. దిమ్మె కూలేందుకు సిద్ధంగా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందేవారు.

పరిష్కారమైందిలా..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యను స్థానికులు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. ఐదురోజుల్లోనే సిమెంట్ పిల్లర్ ప్లింత్ నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. ఇలా ఇది ఒక్కటే కాదు జిల్లాలో గడపగడప కార్యక్రమం ద్వారా పలు సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.



నియోజకవర్గాల వారీగా చేపట్టిన పనులు, చేసిన ఖర్చు వివరాలు..

నియోజకవర్గం	ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు	ఖర్చు చేసిన నిధులు	ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు	ఖర్చు చేసిన నిధులు
కర్నూలు	28	రూ.1.41కోట్లు	937	రూ.1.35కోట్లు
కోడుమూరు	41	రూ.1.36కోట్లు	878	రూ.2.34కోట్లు
ఆదోని	31	రూ.1.16కోట్లు	1665	రూ.4.11కోట్లు
మంత్రాలయం	43	రూ.85.59లక్షలు	1195	రూ.2.87కోట్లు
ఆలూరు	2	రూ.5.71లక్షలు	1631	రూ.4.47కోట్లు
పత్తికొండ	42	రూ.1.14కోట్లు	2207	రూ.4.69కోట్లు
ఎమ్మిగనూరు	24	రూ.86.13లక్షలు	1160	రూ.3.71కోట్లు
పాణ్యం	26	రూ.56.05లక్షలు	553	రూ.1.02కోట్లు
డోన్	20	రూ.79.17లక్షలు	2121	రూ.4.44కోట్లు
బనగానపల్లె	20	రూ.25.76లక్షలు	1981	రూ.6.85కోట్లు
ఆళ్లగడ్డ	22	రూ.44.32లక్షలు	1710	రూ.7.29కోట్లు
నంద్యాల	27	రూ.69.80లక్షలు	1396	రూ.4.05కోట్లు
శ్రీశైలం	38	రూ.1.03కోట్లు	3136	రూ.9.17కోట్లు
నందికొట్కూరు	33	రూ.4.08కోట్లు	1197	రూ.2.25కోట్లు

‘గడపగడప’లో వెలుగులు

- ప్రజాప్రతినిధుల దృష్టికి విద్యుత్ సమస్యలు
- వాటిని పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం
- కర్నూలు, నంద్యాల జిల్లాలకు రూ.70.88కోట్లు మంజూరు
- ప్రజల విన్నపం మేరకు 397 ట్రాన్స్‌ఫార్మర్లు, 22వేల స్తంభాల ఏర్పాటు
- నాణ్యతతో పనులు పూర్తి చేసిన అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించింది. ప్రజలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఎమ్మెల్యేలు ఆదేశించారు. దీంతో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను పరిష్కరించేందుకు అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం.. అందుకు కావాల్సిన నిధులను మంజూరు చేసింది. కర్నూలు, నంద్యాల జిల్లాలకు రూ.70.88కోట్లు విడుదల చేయడంతో పనులు ప్రారంభించిన అధికారులు.. నాణ్యత, నిర్ణీత గడువులోపు పూర్తి కోసం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో అత్యధిక శాతం సమస్యలకు పరిష్కారం లభించింది.

సమస్యల పరిశీలన ఇలా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తీసుకొచ్చిన కార్యక్రమం ‘గడప గడపకు మన ప్రభుత్వం’. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు మంజూరు అయిన సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు చేకూర్చిన లబ్ధి మొత్తం, గత ప్రభుత్వం కంటే మిన్నగా తెచ్చిన పథకాలు, అమలులో పారదర్శకత, ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హుల ఖాతాలోకి నేరుగా నగదు జమ తదితర వాటి గురించి తెలియజేస్తున్నారు. దీంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. ఇందులో వచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలతో పాటు ఏఈలు ఆయా ప్రాంత లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లతో హాజరు కావడంతో సమస్య తెలుసుకోవడం, అందుకు అంచనా వేయడం, నిధులు కోరడం, మంజూరు కావడం, పనులు ప్రారంభించి పూర్తి చేయడం ఇలా.. అన్ని వేగంగా పూర్తయ్యాయి.

ఉమ్మడి జిల్లాకు రూ.70.88కోట్లు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి పనుల కోసం వేసి పంపిన అంచనాలకు నిధుల కొరత లేకుండా మంజూరు చేశారు. సర్కిల్ పరిధిలోని కర్నూలు, నంద్యాల జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో వచ్చిన విన్నపాలకు మోక్షం కల్పించేందుకు ప్రభుత్వం రూ.70.88 కోట్లు మంజూరు చేసింది. దీంతో 397 ట్రాన్స్‌ఫార్మర్లు , 22వేల స్తంభాల ఏర్పాటు చేశారు. వీటితో పాటు వదులుగా వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేశారు.



ఖండేరిలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించి సిమెంట్ స్తంభం ఏర్పాటు చేసి, తీగల ఎత్తు పెంచడంతో పాటు సపోర్ట్ స్తంభం ఏర్పాటు చేసిన దృశ్యం

పనులకు అత్యధిక ప్రాధాన్యత



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులతో పాటు ఏఈలు హాజరవుతున్నారు. అవసరం ఉన్న చోట ఏడీఈలు కూడా పాల్గొంటున్నారు. అక్కడ ప్రజలు చెప్పుకునే సమస్యలను అన్నింటినీ రాసుకుంటున్నారు. తర్వాత వాటిని పరిష్కరించేందుకు అంచనాలు వేసి పంపిస్తున్నారు. నిధులకు కొరత లేదు. ప్రభుత్వం మంజూరు చేయగానే పనులు ప్రారంభించి నాణ్యతతో నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తున్నాం. గడపగడప కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వదులుగా, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయడం, వాటి మధ్య అదనంగా స్తంభం ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడుతున్నాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది.

– ఎం. ఉమాపతి, విద్యుత్ సంస్థ ఆపరేషన్స్ ఎస్ఈ, కర్నూలు.

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

- రూ.1,03,51,000 నకిలీ, రూ.29 వేలు ఒరిజినల్ నోట్లు సీజ్
- ఎనిమిది మంది అరెస్టు

కర్నూలు: నకిలీ కరెన్సీ (నోట్లు) ముఠా గుట్టు రట్టయ్యింది. పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో రెండు గ్రూపులకు చెందిన ఎనిమిది మంది నోట్ల బ్యాగులు మార్చుకుంటుండగా అర్బన్ తాలూకా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఆలూరు గ్రామానికి చెందిన కరిడికొండ గంగాధర్, కర్నూలు ధర్మపేటకు చెందిన అరేకల్ కుమార్, క్రిష్ణగిరి మండలం ఎరుకలిచెరువు గ్రామానికి చెందిన ఈడిగ జయన్న, కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన బోయ బంగి పరుశురాముడు ఒక ముఠాగా, అలాగే జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం క్యాతూరు గ్రామానికి చెందిన జనుపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, బంగిపోగు చిన్ననాగన్న, చాకలి బ్రహ్మ, కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన కమ్మరి వీరేష్ ఆచారి తదితరులు మరో ముఠాగా ఏర్పడ్డారు. వీరు పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ పక్కన అపూర్వ హోమ్స్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం డీల్ ప్రకారం ఒకరి ఒకరు బ్యాగులు మార్చుకుంటుండగా పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేశారు. అదుపులోకి తీసుకొని బ్యాగులను పరిశీలించగా అందులో నకిలీ నోట్లు బయటపడ్డాయి.

ఒకరినొకరు మోసం చేసుకునే క్రమంలో...

ఒక బ్యాగులో 17 బండిల్స్ ఉండగా, అందులో కింద, పైన ఒరిజినల్ రూ.500 నోట్లు పెట్టి మధ్యలో రూ.87,50,000 నకిలీ నోట్లు ఉన్నాయి. అలాగే రెండో గ్రూపునకు చెందిన బ్యాగులో పరిశీలించగా అందులో సుమారు రూ.16.30 లక్షల నకిలీ నోట్లు బయటపడ్డాయి. మొదటి ముఠా వారు రూ.90 లక్షలు నకిలీ కరెన్సీ ఇస్తే రెండో గ్రూపు వారు రూ.30 లక్షలు ఒరిజినల్ కరెన్సీ ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఒరిజినల్ నోట్లు ఇస్తామన్న ముఠా కూడా నకిలీ నోట్లతో వెళ్లి ఒకరినొకరు మోసం చేసుకునే క్రమంలో పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరాం, ఎస్‌ఐలు రామయ్య, సమీర్ బాషా, మన్మథ విజయ్ తదితరులతో కలసి సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రెండు ముఠాల నుంచి రూ.1,03,51,000 నకిలీ నోట్లు (సినిమా షూటింగ్ కోసం వినియోగించే నోట్లు), రూ.29 వేలు ఒరిజినల్ నోట్లతో పాటు మూడు మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. దొంగ నోట్ల ముఠాను పట్టుకుని వారి నుంచి భారీ మొత్తంలో నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నందుకు క్రైం పార్టీ సిబ్బంది ఏఎస్‌ఐ ఆచారి, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుళ్లు మంజుకుమార్, రామ్‌ప్రసాద్, సుధీర్ తదితరులను సీఐ అభినందించారు.



నకిలీ నోట్ల ముఠాను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీరాం

సంక్షేమానికి ధ్రువీకరణ

● పైసా ఖర్చు లేకుండా..



వివాహ ధ్రువపత్రంతో చాకలి వీరేష్, పల్లవి

వివాహ ధ్రువపత్రం చూపిస్తున్న వీరి పేరు చాకలి వీరేష్, పల్లవి. సి.బెళగల్ మండలం కొత్తకోట స్వగ్రామం. మే నెలలో వివాహమైంది. మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలని గ్రామ వలంటీర్ చంద్రశేఖర్‌కు తెలియజేశారు. వెను వెంటనే అతను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాడు. మంగళవారం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ వివాహ ధ్రువపత్రం అందించారు. పైసా ఖర్చులేకుండా సర్టిఫికెట్ ఇవ్వడంతో వారి ఆనందానికి అవధులు లేవు. గతంలో ఏ చిన్న పనికైనా తాము 18 కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సి ఉండేదని సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ఇప్పుడా అవస్థలు తప్పాయని చెబుతున్నారు.



సి. బెళగల్ మండలం ఈర్లదిన్నెలో జగనన్న సురక్ష కార్యక్రమంలో వివిధ సర్వీసులకు దరఖాస్తు దృశ్యం

- జిల్లాలో జగనన్న సురక్షకు విశేష స్పందన
- నాలుగో రోజు 54 సచివాలయాల పరిధిలో 33,799 సర్వీసులు డెలివరీ
- హాజరైన పలువురు ప్రజాప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. వివిధ సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాల్లో అర్హుల జాబితాలో పేరు నమోదుకు క్యూ కడుతున్నారు. నాలుగో రోజు జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సభలు జిల్లాలో ఆహ్లాద వాతావరణంలో జరిగాయి. ప్రతి మండలంలో రెండు సచివాలయాల పరిధిలో గ్రామసభలు జరిగాయి. ఇంటిగ్రేటెడ్, క్యాస్ట్, ఇన్‌కమ్, బర్త్, డెత్, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్, మ్యూటేషన్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సీసీఆర్‌సీ, కుటుంబ విభజన తదితర 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా ఇస్తుండడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో సభలకు హాజరవుతున్నారు. నాలుగో రోజు 54 సచివాలయాల పరిధిలో మొత్తం 91,599 టోకెన్లను రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో 74,480 మంది సర్వీసులను ఇచ్చేందుకు ప్రాసెస్ చేసి వెనువెంటనే 33,799 మందికి అవసరమైన సర్టిఫికెట్లు అందజేశారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ వార్డు మునగాలపాడు, కోడుమూరు మండలం ఎర్రదొడ్డి, అనుగొండలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ హాజరై వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రజలకు ఏం అవసరమో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవే కార్యక్రమాలు చేపడుతారన్నారు. ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలో జరిగిన సభకు హాజరైన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ సురక్ష గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల రోజులైనా అందని డెత్ సర్టిఫికెట్‌ను గంటలో ఇవ్వడం గొప్ప విషయమన్నారు. పత్తికొండ మండలం పందికోనలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని ప్రభుత్వ అందిస్తున్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని శివన్న నగర్‌లో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సర్వీసుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

వేగంగా ఎత్తిపోతల పనులు

- రూ 10.42 కోట్లతో 52 బసాపురం పనులు
- 4 కి.మీ. మేర పైపులైన్ పనులు పూర్తి
- 50 శాతం పంప్‌హౌస్ నిర్మాణం పూర్తి

మంత్రాలయం: కరువు నేలను ప్రభుత్వం సస్యశ్యామలం చేస్తోంది. నదీ జలాలను ఎత్తిపోసి మెట్ట భూములను ఆయకట్టుగా మారుస్తోంది. రైతన్నలు సిరులు పండించేందుకు ఊతమిస్తోంది. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నేతృత్వంలో సాగునీటి పథకాలు రూపు దిద్దుకుంటున్నాయి. వేలాది ఎకరాలకు సాగునీటి గలగలలు దరి చేరనున్నాయి. నియోజకవర్గంలోని మంత్రాలయం మండలం 52 బసాపురం రైతుల పొలాలను నది జలాలతో తడపనున్నారు. రూ 10.42 కోట్లతో 52 బసాపురం ఎత్తిపోతల పనులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శ్రీకారం చుట్టారు. యుద్ధ ప్రాతిపదికన పనులు సాగిస్తున్నారు. 5 నెలల కాలం వ్యవధిలోనే దాదాపు 80 శాతం పనులు పూర్తి చేశారు. పథకం పరిధిలో ఇప్పటికే 4 కి.మీ. మేర పైపులైన్ పనులు పూర్తయ్యాయి.



తుంగభద్ర నది ఒడ్డున నిర్మాణంలో పంప్‌హౌస్

తుంగభద్ర నది ఒడ్డున నూతనంగా నిర్మించే పంప్‌హౌస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి సాగునీరందించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

1455 ఎకరాలకు సాగునీరు

బసాపురం ఎత్తిపోతల పథకం పనులు పూర్తి అయితే 52 బసాపురం గ్రామ పరిధిలో 1455 ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రస్తుతం గ్రామ రైతులు నది చెంతనే ఉన్నా వర్షాధారంతో పంటలు పండించుకునే పరిస్థితి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పథకం మంజూరు చేయించారు. వెను వెంటనే టెండర్లు పిలిచి పనులు కూడా మొదలు పెట్టారు. ఈ పథకం పూర్తి అయితే తమ కష్టాలన్నీ గట్టెక్కుతాయని గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని చెబుతున్నారు.

చరిత్రలో నిలిచేలా సాగునీటి ప్రాజెక్టు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చరిత్రలో నిలిచిపోయేలా సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. వర్షం కురిస్తే తప్ప పంటలు పండని భూములకు నిత్యం సాగునీరు అందేలా చూడటం ఎంతో అభినందనీయం. సీఎం, ఎమ్మెల్యేది రైతు కుటుంబం కాబట్టి మా కష్టాలను పరిష్కరించే విధంగా పాలన కొనసాగిస్తున్నారు. మేము మా గ్రామ ప్రజలు వారికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాం.

జి.లక్ష్మీకాంతరెడ్డి, రైతు, 52బసాపురం

రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశం

కర్నూలు(అగ్రికల్చర్): దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 8న రైతు దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయాధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద పరిహారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం నుంచి రైతుల బ్యాంకు ఖాతాలకు బటన్ నొక్కి విడుదల చేస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి మెగా చెక్‌ను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎంపీలను ఆహ్వానించాలని సూచించారు.అలాగే నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ అగ్రీ ల్యాబ్‌ల ప్రారంభానికి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం కిసాన్ కింద రైతుల ఈ–కేవైసీ ఇప్పటి వరకు 90 శాతం పూర్తి అయిందని, ఈనెల 15 లోపు 100 శాతం పూర్తి కావాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలు రెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, గిరీష్, సునీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రిప్ మంజూరు వేగవంతం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సూక్ష్మ సేద్యం పనులను వేగవంతం చేసినట్లు జిల్లా ఏపీఎం ఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. బుధవారం మంత్రాలయం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా రైతులకు మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం పీడీ విలేకరులతో మాట్లాడుతూ 2023–24లో సూక్ష్మ సేద్యం 5వేల హెక్టార్లకు కల్పించాలనేది లక్ష్యమని.. ఇప్పటి వరకు 9,547 మంది రైతులు 10509.59 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. 758 మంది రైతులు 681.95 హెక్టార్లకు నాన్ సబ్సిడీ కూడా చెల్లించారని తెలిపారు. 610 మంది రైతులకు 541.12 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ సృజన సూక్ష్మ సేద్యం కూడా మంజూరు చేశారని వివరించారు. ఇప్పటికే 167 మంది రైతులకు సంబంధించి 130.18 హెక్టార్లకు కంపెనీలు మెటీరియల్ సరఫరా చేశాయన్నారు.

భార్యాభర్తల ఘర్షణ

- తోపులాటలో కింద పడి మృతి చెందిన భర్త

గడివేముల: కొర్రపోలూరు గ్రామంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ భర్త మృతికి కారణమైంది. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి లోకేశ్వరుడు (37) మద్యానికి బానిసై నిత్యం భార్యతో ఘర్షణ పడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భర్త మద్యం సేవించి ఇంటికి చేరుకుని డబ్బు కోసం భార్య సుబ్బలక్ష్మమ్మతో ఘర్షణ పడ్డాడు. ఆ క్రమంలో ఆమె భర్తను తోయడంతో కడపమాను పక్కన ఉన్న రాయిపై పడ్డాడు. దీంతో తలకు రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పాణ్యం సీఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ హుటాహుటిన గ్రామానికి చేరుకుని విచారణ చేశారు. ఈ మేరకు మృతుని తండ్రి వంగాల చాకలి వెంకటరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ఆసుపత్రికి తరలించారు. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈనెల 25 నాటికి హాస్టళ్లలో అడ్మిషన్లు పూర్తి


మాట్లాడుతున్న జేడీ రంగలక్ష్మిదేవి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఈ నెల 5వ తేదీ నాటికి రెన్యూవల్స్, 25వ తేదీ నాటికి ఫ్రెష్ అడ్మిషన్లు పూర్తి చేయాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మిదేవి ఆదేశించారు. మంగళవారం స్థానిక సంక్షేమభవన్‌లోని తన ఛాంబర్‌లో సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో ఆమె సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ అన్ని వసతి గృహాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వంమెస్ చార్జీలను పెంచిన నేపథ్యంలో ఉదయం టిఫిన్, స్నాక్స్, డిన్నర్‌ను నిర్ణీత సమయంలోగా విద్యార్థులకు వడ్డించి ప్రతి రోజు రాత్రి 7.30 గంటల కంతా ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాలోని అందరూ సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో డైరెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్నారు. సమావేశంలో కర్నూలు, కోడుమూరు, ఆదోని, పత్తికొండ సహాయ సంక్షేమాధికారులు బి.మద్దిలేటి, ఎస్.లీలావతి, సుధాకర్‌బాబు, కె.బాబుతో పాటు జిల్లాకు చెందిన వసతి గృహ సంక్షేమాధికారులు హాజరయ్యారు.

రైతు చూపు.. మిర్చి వైపు

- గతేడాది కలిసొచ్చిన పంట
- ఎకరాకు 25-28 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటా రూ. 24 వేలకు పైగా ధర పలికిన వైనం
- ఈ ఏడాది జిల్లాలో 20 వేల హెక్టార్లలో సాగుకు అవకాశం
- ఎకరా రూ.90 వేలు పలుకుతున్న కౌలు ధర


పేరుసోముల సమీపంలో మిరప నారుమడి

కోవెలకుంట్ల: గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులకు అన్ని విధాలా కలిసొచ్చింది. మొదట్లో వర్షాభావం, సాగునీటి కష్టాలు, తెగుళ్లు, పైరు పూత, పిందె దశలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు.. ఇలా కష్టాలు రైతులను వెంటాడాయి. అష్టకష్టాలు పడి పంట చేతికందే సమయానికి మంచి ధర పలకడంతో రైతులు లాభాలు గడించారు. ఈ ఏడాది మిరప సాగుకు వాతావరణం అనుకూలిస్తుండటంతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. నంద్యాల జిల్లా పరిధిలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 10 వేల హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం. ఈ నెలాఖరు నుంచి మిరప సాగుకు అదును కాగా వర్షాలు అనుకూలంగా మారటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే ఆస్కారం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా నారుమడుల్లో సిద్ధం చేసుకుని సూపర్-10, తేజ, డబ్బీబ్యాడీ రకాలకు చెందిన మిరప సాగుకు నారు పోశారు. ఈ ఏడాది మిరప సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తుండంతో సాధారణ సాగు విస్తీర్ణం కంటే రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. గత ఏడాది క్వింటా రూ. 24 వేల వరకు ధర పలికింది. మిరప సాగులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, కోత, తదితర పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ. లక్షకు పైగా నికర ఆదాయం చేకూరింది. మిరప సాగు కలిసి రావడంతో ఈ ఏడాది రైతులు రెట్టింపు ఉత్సాహంతో అదే పంటపై ఆసక్తి కనబరుస్తున్నారు. పది వేల హెక్టార్లలో సాగు సాధారణ విస్తీర్ణం కాగా సుమారు 20 వేల హెక్టార్లలో సాగయ్యే సూచనలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మిరప సాగుకు పొలాలను కౌలుకు తీసుకునేందుకు రైతులు పోటీ పడుతుండటంతో కౌలు ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం ఎకరాకు రూ. 90 వేల వరకు కౌలు ధర పలుకుతుండటం విశేషం. ఒక్కో రైతు 2 నుంచి 20 ఎకరాల వరకు మిరప సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

గత ఏడాది 25– 28 క్వింటాళ్ల దిగుబడులు

గత ఏడాది జిల్లాలోని ఆయా మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 7,320 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా 10,250 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 3,014 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా ఆయా మండలాల్లో 3,112 హెక్టార్లలో రైతులు మిరప పంట సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్షకు పైగా వెచ్చించారు. మొదట్లో వర్షాభావం, పేరు చివరికోత దశలో అకాల వర్ష ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, జెమిని వైరస్ దిగుబడులపై ప్రభావం చూపాయి. అన్ని కష్టాలను ఎదుర్కొని మిరప దిగుబడులు చేతికంది ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే గత ఏడాది గిట్టుబాటు ధర రైతులను గట్టెక్కించింది. క్వింటా ఎండు మిర్చి రూ. 22 వేల నుంచి రూ. 24 వేలు ధర పలకడంతో దిగుబడులు కాస్త తగ్గినా మద్దతు ధరతో రైతులకు ఆదాయం చేకూరింది.

మూడు ఎకరాల్లో సాగు చేస్తా



గత ఏడాది ఎకరా రూ. 35వేలు కౌలు చెల్లించి మూడు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. ఎకరాకు 22 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. క్వింటా రూ. 24వేల ప్రకారం అమ్ముకున్నాను. ఈ ఏడాది అదే విస్తీర్ణంలో మిరప సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాను. ముందస్తు వర్షాలు అనుకూలంగా మారటంతో మిరప సాగు కలిసొస్తుందని భావిస్తున్నాను. గతేడాది తరహాలో లాభాలు రావాలని కోరుకుంటున్నాను. – కుళాయప్ప, రైతు, అమదాల, కోవెలకుంట్ల మండలం

సబ్ డివిజన్‌లో మిరప సాగు పెరుగుతోంది



గత మూడు సంవత్సరాల నుంచి జిల్లాలో మిరప సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వరుసగా లాభాలు గడిస్తున్న రైతులు ఈ పంటపైనే దృష్టి సారించారు. ఈ ఏడాది స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 3,018 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం. గత ఏడాది దిగుబడులు బాగా రావడంతో సాగు విస్తీర్ణం పెరిగే ఆస్కారం ఉంది. మిరప రైతులు సస్యరక్షణ చర్యలుచేపడితే మంచి దిగుబడి సాధించవచ్చు. – నిరంజన్, ఏడీఏ, కోవెలకుంట్ల

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్


పట్టుబడిన కారు, మద్యం, నిందితులను అరెస్ట్ చూయిస్తున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మాధవరం చెక్‌పోస్టు దగ్గర భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. మంగళవారం స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో సెబ్ సీఐ జయరాంనాయుడు విలేకరులకు వివరాలు వెల్లడించారు. కర్ణాటక నుంచి టీఎస్ 08ఈటీ 4279 నెంబర్ గల కారులో మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన పల్లెపాడు లక్ష్మన్న, వీరేష్ ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామానికి చెందిన బోయ యువరాజు మద్యం తీసుకొస్తున్నారు. సెబ్‌పోలీసులు మంగళవారం తెల్లవారుజామున మాధవరం చెక్‌పోస్ట్ దగ్గర తనిఖీలు చేస్తుండగా కారులో మద్యం బయటపడింది. 21 బాక్సుల్లో 2016 టెట్రా మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. ఈ మద్యంతో పాటు కారును సీజ్ చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. పట్టుబడిన మద్యం విలు రూ. 1,05,000 ఉంటుందని తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, చంద్రమోహన్, హెచ్‌సీలు గోపాల్, లింగప్రసాద్, షరీఫ్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

అతివేగానికి ఇద్దరు బలి

- ఆత్మకూరు సమీపంలో లారీని ఢీకొట్టిన ఆటో
- కర్నూలుకు చెందిన తండ్రి,కుమారుడు మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం


మృతి చెందిన నాగన్న

ఆత్మకూరు రూరల్: అతివేగం ఇద్దరిని బలి తీసుకుంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఇద్దరిని మింగేసింది. కర్నూలు – గుంటూరు రహదారిలో ఆత్మకూరు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన తండ్రి, కుమారుడు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బైర్లూటీ సమీపంలోని సంజీవ నగర్ తండా నుంచి ఏడుగురు ప్రయాణికులతో ఆత్మకూరుకు బయలుదేరిన ఆటో అమలాపురం దాటిన తరువాత ముందు వెళుతున్న మరో ఆటోను ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీకొంది. ఈ లారీ పత్తికొండ నుంచి కాకినాడ వెళుతూ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కర్నూలు నగరంలోని బొంగుల బజార్‌కు చెందిన నాగన్న(36) అక్కడికక్కడే మృతి చెందగా ఆయన తండ్రి వీరయ్య (65) తీవ్రంగా గాయపడి కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్సలో ఉండి కోలుకోలేక మరణించాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎస్ఎన్ తండా వాసులు హనుమంతు నాయక్ (ఆటో డ్రైవర్), వరలక్ష్మీబాయి, వనిత, సుబ్బమ్మ, బైర్లూటీకి చెందిన నాగరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. సంఘటనాస్థలికి హుటాహుటిన వెళ్లిన ఆత్మకూరు సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ కృష్ణమూర్తి పరిస్థితిని సమీక్షించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

బతుకు బాటలో తండ్రి, కుమారుడు మృత్యువాత

కర్నూలు బొంగుల బజార్‌లో బొంగులు, కర్రలు వెదురు ఉత్పత్తుల వ్యాపారం చేసే వీరయ్య తన కుమారుడు నాగన్నతో కలసి మంగళవారం బైర్లూటీకి వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ వెదురు పట్టుడు కట్టెలు, ముళ్లగర్రలు, దోమతెలర కర్రల గురించి వాకబు చేసుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఆటోలో ఆత్మకూరుకు వస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఒకే కుటుంబంలో తండ్రి,కుమారుడు ప్రమాదంలో మరణించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అధికారులు బాధ్యతతో సేవలు అందించాలి

- జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించండి
- సచివాలయ సిబ్బంది పని తీరు మెరుగుపడాలి
- ఐటీ సెక్రటరీ, జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్



మాట్లాడుతున్న ఐటీ సెక్రటరీ కోన శశిధర్, చిత్రంలో కలెక్టర్ మనజీర్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి హాజరైన అధికారులు



నంద్యాల: 'ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతతో వ్యవహరించి మెరుగైన సేవలు అందించాలి. అర్జీదారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్వయంగా కలిసి ఎలాంటి సంతృప్తి పొందుతాడో అదే రీతిలో జగనన్న చెబుదాం దరఖాస్తులను కూడా అదే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలి' అని ఐటీ సెక్రటరీ, జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్ మాట్లాడుతూ సచివాలయ, మండల స్థాయి సిబ్బంది పనితీరు మెరుగుపరిచి జగనన్నకు చెబుదాంకు వచ్చిన అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. 1902కి వచ్చే ఫిర్యాదుల విషయంలో ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపిస్తోందన్నారు. మండలంలో ఏఏ అంశాలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయో అన్వేషించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యం కాని సమస్యలకు సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇచ్చి వాస్తవ విషయాలను అర్జీదారులకు వివరించి సంతృప్తి పరచాలన్నారు. భూ సమస్యలు, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించి పరిష్కరించిన వాటిలో అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. ఆత్మకూరు, బండి ఆత్మకూరు, నందికొట్కూర్ మండలాల్లో అసంతృప్తి శాతం అధికంగా ఉందని నెల వ్యవధిలో మెరుగు పరచాలని ఆత్మకూరు ఆర్డీవోను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ మే 9 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు జగనన్నకు చెబుదాం 3,781 ఫిర్యాదులు వచ్చాయని, 58 శాతం ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా 42 శాతం ఫిర్యాదుల పరిష్కారం వివిధ దశల్లో ఉందని, సంబంధిత సమాచారాన్ని శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జగనన్నకు చెబుదాం స్పందన టీం జిల్లాస్థాయి, డివిజన్, మండల స్థాయిలో అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్‌కమిషనర్ రవిచంద్రారెడ్డి, నంద్యాల,ఆత్మకూరు,డోన్ ఆర్‌డీఓలు శ్రీనివాసులు,దాసు,వెంకటరెడ్డిలు, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతి చెందిన అబ్రహం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో శివాజీ గోపురం సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి మంగళవారం మధ్యాహ్నం వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ దివాకర్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ద్వారా ఆత్మకూరు సమీపంలోని వడ్లరామాపురానికి చెందిన అబ్రహం (28)గా ఆచూకీ గుర్తించారు. మృతుడు ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుని శ్రీశైలంలోని కొత్తపేటలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా నాలుగు రోజుల క్రితం అతని భార్య మగబిడ్డకు జన్మనిచ్చింది. కాగా అబ్రహ్మం ఫుల్‌గా మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు గురై సోమవారం రాత్రి మరణించి ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారించినట్లు చెప్పారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని సున్నిపెంట వైద్య శాలకు తరలించినట్లు, కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

మత్స్య శాఖ పథకాలపై ఆర్బీకేల స్థాయిలో అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ, హాజరైన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్య శాఖ పథకాలపై ఆర్బీకేల స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో మత్స్యశాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జేసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 21 యూనిట్ల ఏర్పాటుకు జిల్లా స్థాయి కమిటీ అమోదం తెలిపింది. 16 ఫిష్ ఆంధ్ర యూనిట్లు, ఒక త్రీవీలర్, ఒక ఫోర్ వీలర్, రూ.10 లక్షల యూనిట్, 20 లక్షల యూనిట్‌లు ఒకటి చొప్పున మంజూరుకు అనుమతిచ్చారు. జేసీ మాట్లాడుతూ రుద్రవరం దగ్గర ఉన్న బోటింగ్ క్లబ్‌లో కూడా చేపల ఉత్పత్తులను అందుబాటులో ఉంచడంతో పాటు రాక్ గార్డెన్‌లో చేపల ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అమలు చేస్తున్న పథకాలకు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామలమ్మ, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, డీఆర్‌డీఏ అదనపు పీడీ శ్రీధర్‌రావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, జిల్లా ఫిషర్‌మన్ కో–ఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో తొమ్మిది మంది అరెస్ట్


గంజాయి విక్రేతలు, కొనుగోలుదారుల అరెస్ట్ చూపుతున్న సీఐ దివాకర్‌రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో నలుగురు గంజాయి విక్రేతలు, ఐదుగురు కొనుగోలుదారులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ గంగయ్య యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక లంబాడీ కాలనీలో కొర్ర దసలీబాయి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో మంగళవారం సోదాలు జరుపగా 2.900 కిలోల గంజాయి లభించింది. దసలీబాయిని విచారించగా సున్నిపెంటకు చెందిన పటాన్ అబ్దుల్ సుకూర్, లంబాడీ కాలనీకి చెందిన కేతావత్ హారతీబాయి, నాగమణిబాయి దగ్గర గంజాయి కొని చిన్న చిన్న పొట్లాలుగా కట్టి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ మేరకు సోదాలు జరుపగా హారతిబాయి వద్ద ఒక కేజీ 100 గ్రాముల గంజాయి, నాగమణిబాయి దగ్గర 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి కొనుగోలు చేస్తున్న మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. దాడుల్లో తహసీల్దార్ రాజేంద్రసింగ్, రెవెన్యూ అధికారులు రంగసాయి, ప్రదీప్ పోలీసులు పాల్గొన్నారు.

కర్నూలు సర్కిల్‌కు నలుగురు ఎఫ్‌ఆర్‌ఓలు

- ఆదోని అటవీశాఖ రేంజర్‌గా నంద్యాల జిల్లావాసి తేజశ్విని


తేజశ్విని

కర్నూలు కల్చరల్: కర్నూలు సర్కిల్ అటవీ శాఖలో నూతనంగా నలుగురు ఫారెస్ట్ రేంజ్ అధికారులు (ఎఫ్ఆర్ఓ) నియమితులయ్యారు. ఈ నలుగురు మహిళలే కావడం విశేషం. ఏపీపీఎస్సీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 21 ఎఫ్ఆర్ఓల నియామకం జరిగింది. రాయలసీమకు ఐదుగురిని కేటాయించగా అందులో నలుగురు కర్నూలు సర్కిల్‌కు వచ్చారు. వీరిలో సిద్దవటం ఎఫ్ఆర్ఓగా కళావతి, ప్రొద్దుటూరుకు హేమాంజలి, ఒంటిమిట్టకు ప్రణీతా బాయ్, ఆదోనికి పేరుసోముల తేజశ్విని నియమితులయ్యారు. వీరందరూ అస్సాంలో 18 నెలలు శాఖ పరమైన శిక్షణ పొందారు. కాగా ఆదోని డివిజన్ ఎఫ్ఆర్ఓగా నియమితులైన పేరుసోముల తేజశ్విని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం శాతన కోట గ్రామానికి చెందిన రత్నమ్మ, పి.భూషన్నల మూడో కుమార్తె. తండ్రి జ్యుడీషియల్ ఉద్యోగి. తేజశ్విని హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేశారు.

రేషన్ మస్తుగా..

- కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, బ్యాళ్లు
- రాగులు, జొన్నలు కూడా అందుబాటులోకి
- అర్బన్‌కార్డు దారులకు అదనంగా గోధుమ పిండి
- బియ్యం ఒక్కటే అంటూ పచ్చపత్రిక విషపు రాతలు


ఎండీయూ వాహనాల ద్వారా పేదలకు బియ్యంతో పాటు చక్కెర, గోధుమ పిండి పంపిణీ చేస్తున్న దృశ్యం

ఫ్యాక్ట్ చెక్

కర్నూలు(సెంట్రల్): పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తోంది. పెరిగిన ధరలతో పేదలు ఇబ్బంది పడకూడదని నిత్యాసర సరుకులను సైతం వారికి అందుబాటులో ఉంచింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రేషన్ కార్డు దారులకు బియ్యం, చక్కెర, బ్యాళ్లతోపాటు రాగులు, జొన్నలు, గోధుమ పిండి అందించేందుకు చర్యలు చేపట్టింది. అయితే, ఈ నిత్యావసరాల పంపిణీపై పచ్చ పత్రిక ఈనాడు విషం చిమ్ముతోంది. బియ్యం మాత్రమే పంపిణీ అంటూ ఈనెల 2వ తేదీ 'ప్రచారం గొప్ప.. ఇచ్చింది కొంత' పేరుతో కథనం అల్లి ప్రచురించింది. ఈ నేపథ్యంలో వాస్తవాలు ప్రజలకు తెలిసేలా ఆధారాలతో కథనం.

అందుబాటులో రాగులు, జొన్నలు

కర్నూలు జిల్లాలో 1232 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 6,67,990 రేషన్‌కార్డుదారులు ఉన్నారు. వీరి కోసం 10,259 టన్నుల బియ్యంతో పాటు 322.979 టన్నుల చక్కెర, 654.307 టన్నుల బ్యాళ్లు, 1750.563 టన్నుల రాగులు, 252.188 టన్నుల ఆట గోధుమ పిండిని రాష్ట్ర ప్రభుత్వ కేటాయించింది. అయితే, రెండునెలలుగా నాఫెడ్ నుంచి బ్యాళ్ల కేటాయింపులు లేకపోవడంతో ఉన్న వాటిలో 25 శాతం మంది రేషన్ కార్డుదారులకు రొటేషన్ పద్ధతిలో కేటాయిస్తున్నారు. గత రెండు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌దారులకు రాగులను అందుబాటులోకి తెచ్చింది. శరీరానికి ఎంతో మేలు చేసే వీటిని పేద ప్రజల కోసం కర్ణాటక ఎఫ్‌సీఐ నుంచి తెప్పించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కార్డుకు కేజీ ప్రకారం అందజేస్తున్నారు. కొన్ని చోట్ల రాగులను తీసుకోవడానికి ప్రజలు విముఖత చూపుతు న్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఆదోనిఅర్బన్, ఆలూరు, కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి, హాలహర్వి, హొళగుంద మండలాల్లో కార్డుదారులకు రెండు నెలలుగా జొన్నలు వేస్తున్నారు. బియ్యంకోటలో కార్డుకు కేజీ ప్రకారం అందజేస్తున్నారు.

అర్బన్ కార్డుదారులకు గోధుమ పిండి

జిల్లాలోని కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్, ఆదోని, ఎమ్మిగనూరు మునిసిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీల్లో బియ్యం, చక్కెర, బ్యాళ్లు, రాగులతో పాటు అదనంగా గోధుమ పిండి పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక్కో కార్డుకు కేజీ చొప్పున అందజేసే ఈ గోధుమ పిండి ధర రూ.16 మాత్రమే. అర్బన్ రేషన్ కార్డుదారులందరూ ఈ సరుకులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఎండీయూ వాహనదారులను అడిగి తీసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులకు బియ్యం, చక్కెర, బ్యాళ్లతోపాటు అర్బన్‌లో గోధుమ పిండి, జిల్లాలోని అన్ని చౌక ధరల డిపోల్లో రాగులు, ఆదోని ఏరియాలో 8 మండలాల్లో జొన్నలు అందుబాటులో ఉంచింది. అయితే, ఆయా వస్తువులను లబ్ధిదారులు ఎండీయూ ఆపరేటర్లను అడిగి తీసుకోవాలి. కొన్ని చోట్ల డీలర్లు అందుబాటులో లేవని చెబుతున్నా అది నిజం కాదు. – ఆచార్యులు, డీఎస్ఓ